# రేషన్ కార్డులు కలేనా..?

రేషన్ కార్డు కలవుతోంది. దరఖాస్తుల స్వీకరణ ప్రచారానికే పరిమితమైంది. రేషన్ కార్డు ప్రక్రియ ఆన్‌లైన్ సైట్ తెరచుకోనంటోంది. కార్డు మంజూరుపై స్పష్టత లేకపోవడంతో అర్హుల్లో అయోమయం నెలకొంటోంది. దరఖాస్తుదారులకు సమాధానం చెప్పలేక సచివాలయ సిబ్బందికి తలభారంగా పరిణమించింది. ఇలాంటి తరుణంలో రేషన్ కార్డుల మంజూరు సంక్రాంతి సాధ్యమేనా? అనే ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి.

- జిల్లాలో ఎదురుచూపులు
- 2వ తేదీ నుంచి దరఖాస్తులు స్వీకరణ అంటూ ప్రచారం
- ఇప్పటివరకు తెరచుకోని ఆన్‌లైన్
- సచివాలయ సిబ్బందికి శిరోభారం
- అయోమయంలో అర్హులు


గత ప్రభుత్వ పాలనలో ఇచ్చిన రేషన్‌కార్డులు (ఫైల్)

**చిత్తూరు రూరల్ (కాణిపాకం):** పేదలకు రేషన్‌కార్డు ఉంటే అందే కొండంత భరోసా. ప్రతి నెలా కడుపు నింపుతుందని ధీమా ఉంటోంది. అలాగే పిల్లల చదువుల భారానికి అండగా నిలబడుతుంది. పలు ప్రభుత్వ పథకాల ప్రయోజనాలకు ఆధారమవుతోంది. ముఖ్యంగా లక్షలాది రూపాయలు వ్యయమయ్యే వైద్యానికి సాయపడుతోంది. ప్రస్తుతం జిల్లాలో 5.40 లక్షల రేషన్‌కార్డులున్నాయి. ఈ కార్డుదారులకు ప్రతి నెలా 15వేల మెట్రిక్ టన్నుల రేషన్ బియ్యం సరఫరా అవుతోంది. అలాగే చక్కెర 3.50 టన్నులు, కందిపప్పు 5 టన్నుల వరకు అందుతోంది. కార్డు ఆధారంగా సుమారు 4.95 లక్షల మంది ఆరోగ్యశ్రీ కార్డును పొందారు. దీని ఫలితంగా వారికి ఏటా వైద్యసేవల పరంగా రూ.25 లక్షల వరకు సేవలు పొందేందుకు అవకాశం ఉంది. దీనికితోడు స్కాలర్‌షిప్‌లు, పలు పథకాల ద్వారా ఉచిత విద్య, కేంద్ర ప్రభుత్వం ఇస్తున్న రాయితీ రుణాలు పొందుతున్నారు. అయితే ప్రస్తుతం అర్హులైన వారు రేషన్ కార్డుల కోసం అంగలార్చాల్సి వస్తోందని వాపోతున్నారు.

**గతంలో తలుపుతట్టి ఇచ్చేవారు**

వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన కొంత కాలానికి కరోనా విపత్తు ఎదురైంది. అయినా ప్రజలకు ఇచ్చిన మాట కోసం అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పథకాలను అమలు చేశారు. అందులో ఒకటి రేషన్ కార్డు కూడా. కరోనా వేళ కొందరు పేదలు ప్రభుత్వ పథకానికి దూరంగా ఉన్నారని గుర్తించి రేషన్‌కార్డు మంజూరుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. స్పందన వేదికగా చేసుకుని ఇంట్లో నుంచి అర్జీ పెట్టుకున్న రేషన్‌కార్డును మంజూరు చేయించారు. కరోనా తగ్గుముఖం పట్టిన తర్వాత రేషన్ కార్డుల మంజూరు వేగవంతం చేయించారు. సచివాలయంలో దరఖాస్తు చేసుకున్న అర్హులకు నిమిషాల వ్యవధిలో కార్డులను అందజేశారు. అది కూడా వలంటీర్ల ద్వారా దరఖాస్తు అందజేస్తే..గడప దాటకుండా కార్డును చేతిలో పెట్టారు. దీంతో రేషన్‌కార్డు కష్టాలు దాదాపు 90శాతం తీరాయి. ఆ తర్వాత ఆరు నెలలకు ఒకసారి గడువు పెట్టి రేషన్ కార్డు మంజూరు చేస్తూ వచ్చారు. దీంతో ప్రజలకు, రేషన్‌కార్డు కావాలనే కోరుకునే వాళ్లకు అప్పట్లో ఒక స్పష్టత ఉండేది. వలంటీర్లు, సచివాలయ సిబ్బంది కార్డు కోసం వచ్చిన దరఖాస్తులను పరిశీలించి ఎప్పటికప్పుడు ఆన్‌లైన్ చేసి కార్డుదారులకు భరోసాను ఇచ్చేవారు. ప్రభుత్వ పథకాలను సులభతరంగా పొందేవారు.

**ఇప్పుడు స్పష్టత ఏదీ?**

ప్రస్తుతం రేషన్‌కార్డు కోసం ఎదురు చూస్తున్న వారు అత్యధికంగా...కొత్తగా పెళ్లైనా వారు, కుటుంబ తగాదాల మూలాన విడిపోయిన వారు, సభ్యుల చేర్పు, తొలగింపు, ఇతర రాష్ట్రాల నుంచి వచ్చిన కుటుంబాలు, ఆదాయ పన్ను సమస్యలున్న వారు రేషన్‌కార్డు మంజూరు కోసం ఎదురుచూస్తున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఆరు నెలలు గడుస్తున్నా ప్రభుత్వ పథకాల ఫలాలు అర్హుల దరికి చేర్చడంలో మీనమేషాలు లెక్కిస్తోంది. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను నెరవేర్చక కుంటి సాకులు చెబుతోందని, కనీసం రేషన్‌కార్డు మంజూరుకు సరైన స్పష్టత ఇవ్వడం లేదని ప్రజలు మండిపడుతున్నారు. ఈనెల 2వ తేదీ నుంచి రేషన్ కార్డుకు దరఖాస్తు చేసుకోవచ్చని ప్రకటించిన ప్రభుత్వం కార్డు మంజూరుకు కొన్ని అర్హతలను ప్రచారం చేయించింది. అయితే షరతుల విషయంలో సచివాలయ సిబ్బంది సరైన స్పష్టత లేదని చెప్పడం.. ఈ కారణంగా సచివాలయాల్లో దరఖాస్తులు కూడా తీసుకోలేని పరిస్థితి. ఇక కార్డు మంజూరుకు సంబంధించి ఆన్‌లైన్‌లో ఎలాంటి అవకాశం రాలేదని, వచ్చాక తెలియజేస్తామని దరఖాస్తుదారులను తిప్పి పంపిస్తున్నారు. దీంతో కార్డుల మంజూరుపై నీలినీడలు కమ్ముకుంటున్నాయి.

**ఆందోళన వద్దు**

రేషన్‌కార్డుకు సంబంధించి అర్హులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. డిసెంబర్ 2వ తేదీ నుంచి దరఖాస్తులు స్వీకరణకు అవకాశం ఇచ్చారు. ఆన్‌లైన్ ప్రక్రియ జరుగుతోంది. త్వరలో ఆన్‌లైన్‌లో అవకాశం ఇస్తారు. ఈ విషయంలో అనుమానాలు, ఆందోళనలు వద్దు. ప్రభుత్వం నిర్ణీత సమయానికి కార్డులు ఇస్తుంది.

–శంకరన్, డీఎస్‌ఓ, చిత్తూరు

## క్లుప్తంగా

### పంటల బీమా చేసుకోండి

**బంగారుపాళెం:** మామిడి పంటకు బీమా చేసుకోవాలని ఉద్యానశాఖ అధికారిణి సాగరిక ఆదివారం తెలిపారు. మామిడి పంటకు ప్రభుత్వం పంటల బీమా పథకాన్ని వర్తింపజేసిందని ఆమె అన్నారు. రైతులు ఎకరా మామిడికి పంటల బీమా పథకం కింద రూ.1,750 చెల్లించాలన్నారు. పంట నష్టం జరిగితే రైతులకు ఎకరాకు రూ.35 వేల వంతున బీమా కంపెనీలు నష్టపరిహారం చెల్లిస్తాయని వివరించారు. రైతులు ఈనెల 15వ తేదీలోపు మామిడి పంటకు బీమా ప్రీమియం చెల్లించాలన్నారు. రైతులు బ్యాంకుల ద్వారా లేదా కామన్ సర్వీస్ సెంటర్, బీమా కంపెనీ, ఇన్సూరెన్స్ ఏజెంట్ ద్వారా ప్రీమియం చెల్లించవచ్చని పేర్కొన్నారు. బీమా పథకాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

### సాయిబాబా ఆలయంలో భిక్షాటన

**చిత్తూరు రూరల్ (కాణిపాకం):** దత్త జయంతిని పురస్కరించుకుని చిత్తూరు, కట్టమంచిలోని శ్రీ విశ్వషిరిడీ సాయిబాబా మందిరంలో ఆదివారం భక్తులు భిక్షాటన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా మందిరంలోని బాబాకు పాలాభిషేకం చేశారు. హారతి అందించి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. అనంతరం నగర వీధుల్లో భిక్షాటన చేశారు. ఇందులో భాగంగా ఏర్పాటు చేసి భజన కార్యక్రమాలు అలరించాయి.

### హెచ్‌ఆర్‌ఏ పాలసీ అమలు చేయాలి

**నగరి:** ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు హెచ్‌ఆర్‌ఏ పాలసీ అమలు చేయాలని కాంట్రాక్ట్ అండ్ ఔట్‌సోర్సింగ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ జిల్లా చైర్మన్ పీబీ బాలసుబ్రమణ్యం డిమాండ్ చేశారు. ఆదివారం నగరి పట్టణంలోని మార్కెట్ యార్డ్ భవనంలో ఏపీ జేఏసీ అమరావతి అనుబంధంగా ఉన్న కాంట్రాక్ట్ అండ్ ఔట్‌సోర్సింగ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ డివిజన్ స్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జీఓ నెంబర్ –7ను సవరించి ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు ప్రభుత్వం న్యాయం చేయాలన్నారు. స్కిల్డ్, అన్‌స్కిల్డ్ తరగతుల వేతన వ్యత్యాసాన్ని సవరించాలన్నారు. సీనియార్టీ ప్రాతిపదికన వార్షిక ఇంక్రిమెంట్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.జ్ఞాన శేఖర్ మాట్లాడుతూ కాంట్రాక్ట్ అండ్ ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు మినిమం టైం స్కేల్ వర్తింపచేయాల డిమాండ్ చేశారు.

**డివిజన్‌కు నూతన కమిటీ**

సమావేశంలో నగరి డివిజన్‌కు నూతన కమిటీని ఎన్నుకున్నారు. నగరి డివిజన్ నూతన కమిటీకి చైర్మన్‌గా యం.షకీలా (నగరి పురపాలక సంఘం), ప్రధాన కార్యదర్శిగా టి.మురళి(సాంఘిక సంక్షేమ శాఖ), వైస్ చైర్మన్‌గా వేలాయుధం(వెటర్నరీ విభాగం), గౌరవ అధ్యక్షుడిగా జైపాల్(మార్కెటింగ్), ప్రచార కార్యదర్శిగా డి.మస్తాన్ (మున్సిపాలిటీ విభాగం), ఆర్గనైజింగ్ సెక్రటరీగా గోపీనాథ్(వెటర్నరీ విభాగం), అధికార ప్రతినిధిగా ముని బాబు(ట్రెజరీ), జాయింట్ సెక్రెటరీగా మధుసూదన్, ప్రతాప్, ఈసీ మెంబర్స్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

## ఈరోజు

### ప్రజా సమస్యల పరిష్కార వేదిక

**చిత్తూరు అర్బన్:** చిత్తూరు మునిసిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో సోమవారం ఉదయం 10.30 గంటల నుంచి ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (గ్రీవెన్స్‌డే) నిర్వహించనున్నట్లు కమిషనర్ నరసింహ ప్రసాద్ ఓ ప్రకటనలో తెలిపారు. ప్రజలు సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువచ్చి పరిష్కరించుకోవాలని కోరారు.

**ఐరాలలో..**

**ఐరాల:** తన కార్యాలయంలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు నిర్వహించనున్నట్లు తహసీల్దార్ మహేష్‌కుమార్ ఆదివారం తెలిపారు. మండల ప్రజలు తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువచ్చి పరిష్కరించుకోవాలని కోరారు. అన్ని శాఖల మండల అధికారులు హాజరు కావాలన్నారు.

**తవణంపల్లెలో..**

**తవణంపల్లె:** స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం ప్రజాసమస్యల పరిష్కార వేదిక నిర్వహిస్తామని ఎంపీడీఓ రెడ్డి బాబు తెలిపారు. ప్రజలు దీనిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

**ఫ్యామిలీ డాక్టర్**

**ఐరాల:** మండలంలోని పొలకల రెడ్డివారి పల్లెలో సోమవారం ఉదయం 10 నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించనున్నట్లు స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారి ప్రవీణ్‌కుమార్ తెలిపారు. గ్రామంలో రోగులకు వివిధ రకాల వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేస్తామని, గ్రామస్తులు దీనిని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

**ఉచిత కంటి వైద్య శిబిరం**

**బంగారుపాళెం:** స్థానిక మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో సోమవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం వరకు మిషన్ ఫర్ విజన్ ట్రస్ట్, చెన్నై శంకర్ నేత్రాలయ సంయుక్త ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు నిర్వాహకుడు మురళీకృష్ణ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. కంటి శస్త్రచికిత్స అవసరమైన వారిని గుర్తించి, చెన్నై శంకర్ నేత్రాలయ ఆస్పత్రికి తరలించి శస్త్రచికిత్సలు చేయనున్నట్టు తెలియజేశారు. మండల ప్రజలు దీనిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

### కాణిపాక వరసిద్ధునికి విరాళాలు


విరాళం అందజేస్తున్న దాత జయప్రకాష్‌రెడ్డి

**కాణిపాకం:** కాణిపాక శ్రీవరసిద్ధి వినాయక స్వామి దేవస్థానంలోని నిత్యాన్నదాన ట్రస్టుకు దాతలు ఆదివారం విరాళాలు అందజేశారు. చెన్నైకు చెందిన అశోక్‌కుమార్, కల్యాణి రూ.1.70 లక్షలు అందజేశారు. అలాగే బెంగళూరుకు చెందిన జయప్రకాష్‌రెడ్డి నిత్యాన్నదానానికి రూ.2 లక్షలు, గోసంరక్షణ ట్రస్టుకు రూ.2.20 లక్షలు అందజేశారు. దాతలకు ఆలయ అధికారులు ప్రత్యేక దర్శనం కల్పించి తీర్థప్రసాదాలు అందజేశారు. ఏఈఓ రవీంద్ర బాబు, సిబ్బంది కోదండపాణి, చిట్టిబాబు పాల్గొన్నారు.

### మామిడి పంటకు బీమా పథకం

**ఐరాల:** అగ్రికల్చర్ ఇన్సూరెన్స్ కంపెనీ ఆఫ్ ఇండియా లిమిటెడ్ (ప్రైవేటు) అనే సంస్థ రాష్ట్ర ప్రభుత్వం సహకారంతో కాలానుగుణంగా మామిడి పంటల బీమా పథకాన్ని చెల్లించనున్నట్లు మండల ఉద్యానవన శాఖ అధికారిణి సాగరిక తెలిపారు. ఆదివారం ఆమె మాట్లాడుతూ మామిడి రైతులు ఎకరా మామిడి పంటకు పంటల బీమా పథకం కింద రూ.1,750 చెల్లించాలన్నారు. 2024–25వ సంవత్సరానికి వర్తింపచేస్తారని తెలిపారు. మండలంలోని మామిడి రైతులు బీమా సౌకర్యాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు.

## కంటి పాపను రక్షించుకుందాం


కంటి పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

**కాణిపాకం:** ప్రస్తుత పరిస్థితుల్లో ఫోన్‌ల వాడకం, సరైన పౌష్టికాహారం లేక కంటిపాప దెబ్బతింటోందని, వైద్యుల సూచనలు పాటించి కంటిని రక్షించుకుందామని ఈఓ పెంచల కిషోర్ అన్నారు. కాణిపాకంలోని వరసిద్ధి వినాయక దేవస్థానంలో ఆదివారం అరవింద్ ఐ ఆస్పత్రి ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్యశిబిరాన్ని నిర్వహించారు. శిబిరంలో 200మందికి కంటి పరీక్షలు నిర్వహించారు. ఏఈఓ రవీంద్రబాబు, సిబ్బంది కోదండపాణి, సీఎఫ్‌ఓ నాగేశ్వరరావు పాల్గొన్నారు.

## ఫ్లై ఓవర్‌పై వాహనాల పరుగు


పనులు పూర్తి కావడంతో పుత్తూరు ఫ్లై ఓవర్‌పై వెళుతున్న వాహనాలు

**పుత్తూరు:** గత వైఎస్‌ఆర్ సీపీ ప్రభుత్వ హయాంలో మాజీ మంత్రి ఆర్కే రోజా చేసిన కృషి ఫలితంగా నేడు పుత్తూరు–చెన్నై జాతీయ రహదారిలోని ఫ్లై ఓవర్ బ్రిడ్జిపై వాహనాలు పరుగులు పెడుతున్నాయి. అప్పట్లో టీడీపీ నేతల తప్పిదాలతో వడమాలపేట నుంచి పుత్తూరు మీదుగా నగరి వరకు వెళ్లే జాతీయ రహదారి పనులు ఆగిపోయినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఫలితంగా నగరిలోని ఓజికుప్పం, పుత్తూరు, పాదిరేడుల వద్ద జరిగిన రోడ్డు ప్రమాదాల్లో పలువురు ప్రాణాలు పోగొట్టుకున్నారు. దీనిపై తీవ్రంగా స్పందించిన అప్పటి పర్యాటక శాఖ మంత్రి ఆర్కే రోజా, నాటి కేంద్ర రోడ్లు, రవాణా శాఖ మంత్రి నితిన్ గడ్కరీని ఢిల్లీలో రెండు పర్యాయాలు కలసి నివేదికలు సమర్పించారు. చిత్తూరు జిల్లాలోని ఎన్‌హెచ్ రోడ్లపై జరిగిన రోడ్డు ప్రమాదాల్లో చనిపోయినవారి వివరాలను అందజేశారు. అంతేకాకుండా పూర్తికాని రోడ్ల విస్తరణ పనులు, ప్రారంభమే కాని అప్రోచ్ రోడ్లపై సమగ్రంగా నివేదిక ఇచ్చారు.. దీనిపై ఈఏడాది జనవరి 22న రహదారి విస్తరణ పనులకు కేంద్రం పచ్చజెండా ఊపింది. ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని రెండు జాతీయ రహదారుల్లో 81.38 కి.మీ నిడివికి రూ.1532.54 కోట్లు మంజూరు చేసి టెండర్లను ఆహ్వానించింది. ఏడాదిగా జరుగుతున్న విస్తరణ పనుల్లో భాగంగా పుత్తూరులోని ఫ్లై ఓవర్ బ్రిడ్జి పనులు పూర్తయ్యాయి. దీంతో చెన్నై–తిరుపతి మధ్య వెళ్లే వాహనాలు ఫ్లై ఓవర్ మీదుగా పరుగులు పెడుతున్నాయి. దీంతో నారాయణవనం రోడ్డు సర్కిల్ వద్ద జరిగే ప్రమాదాలను అరికట్టినట్లే. ఫ్లై ఓవర్ పూర్తి కావడంపై ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

### భక్తి శ్రద్ధలతో రుద్రహోమం

**సదుం:** మండలంలోని ఎర్రాతివారిపల్లె పెద్దిరెడ్డి భాస్కర్ రెడ్డి కాలనీలోని కన్యమూల వినాయక స్వామి ఆలయంలో ఆదివారం రుద్రహోమం నిర్వహించారు. ఆలయ మూడవ వార్షికోత్సవం సందర్భంగా ఆలయ ధర్మకర్త రాజారెడ్డి ఆధ్వర్యంలో హోమాలు, అభిషేకాలు, చెక్కభజనలు, కోలాట కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. నూతనంగా ఏర్పాటు చేసిన ఉత్సవ విగ్రహాలకు పూజలు చేశారు. భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు.

## గుర్తు తెలియని వాహనం ఢీ: రైతుకు గాయాలు

**పుంగనూరు:** గుర్తు తెలియని వాహనం ఢీకొని ఓ రైతు తీవ్రంగా గాయపడిన సంఘటన శనివారం రాత్రి పుంగనూరు మండలంలో చోటుచేసుకుంది. వివరాలు..మండలంలోని దిగువకొండమీద పల్లెకు చెందిన రైతు వెంకట్రమణ(65) పొలం పనులకు వెళ్లి తిరిగి వస్తుండగా వెంకట్రమణను గుర్తు తెలియని వాహనం ఢీకొని ఆగకుండా వెళ్లిపోయింది. రోడ్డుపై వెంకట్రమణ అపస్మారక స్థితిలో పడి ఉండటం గమనించి ఆదివారం ఆ ప్రాంత వాసులు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.


క్లాసికల్ డ్యాన్స్‌పోటీలకు హాజరైన బాలబాలికలు

### క్లాసికల్ డ్యాన్స్ పోటీలు

**పుంగనూరు:** పట్టణంలోని లయన్స్‌క్లబ్, లియో క్లబ్ సంయుక్తంగా క్లాసికల్ డ్యాన్స్ పోటీలు నిర్వహించారు. ఆదివారం ప్రతినిధులు మణికంఠ, త్రిమూర్తిరెడ్డి ఆధ్వర్యంలో చిల్డ్రన్స్ ఫెస్టివల్‌ను పురస్కరించుకుని పోటీలు నిర్వహించామన్నారు. నూతన సంవత్సరానికి స్వాగతం పలుకుతూ, 2024కు వీడ్కోలు పలుకుతూ ఏర్పాటు చేసిన పోటీలకు మంచి స్పందన లభించిందని చెప్పారు. ఈ పోటీలలో బాలబాలికలు అధిక సంఖ్యలో పోటీల్లో పాల్గొన్నారు.

### త్రైత సిద్ధాంత భగవద్గీతపై ప్రచారం


శాంతిపురం: వెదురుగుట్టపల్లెలో ప్రచారం చేస్తున్న సేవా సమితి సభ్యులు

**శాంతిపురం:** ఆచార్య ప్రబోధానంద యోగీశ్వరుడు రచించిన త్రైత సిద్ధాంత భగవద్గీతపై ప్రబోధ సేవా సమితి ఆధ్వర్యంలో ప్రచారం చేశారు. ఆదివారం సమితి అధ్యక్షుడు కృష్ణ ఆధ్వర్యంలో వెదురుగుట్టపల్లె, బీరనకుప్పం, కదిరిఓబనపల్లెలో ఇంటింటికీ వెళ్లి త్రైత సిద్ధాంత గ్రంథాలను ప్రజలకు ఉచితంగా అందజేశారు. కార్యక్రమంలో ప్రబోధ సేవా సమితి సభ్యులు దేవరాజులు, శరవణ, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

**గంగవరంలో..**


గంగవరం మండలంలో..

**గంగవరం:** హిందువుల పరమ పవిత్ర గ్రంథం భగవద్గీతను ప్రతి ఇంటా పారాయణం చేయాలని త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి సభ్యులు కోరారు. ఇంటింటా హిందూ ధర్మ ప్రచారంలో భాగంగా ఆదివారం మండలంలోని జీడిమాకులపల్లెలో త్రైత సిద్ధాంత భగవద్గీత, అనుబంధ ఆధ్యాత్మిక గ్రంథాలతో ప్రచారం చేశారు. కర్మయోగి విశిష్టత, త్రైత సిద్ధాంత జ్ఞానం గురించి తెలుసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో భాస్కర్, బాలాజీ, హేమంత్, వాణిశ్రీ, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

## ఆయాలకు జీతాలివ్వండి మహాప్రభో..!


సమావేశంలో మాట్లాడుతున్న నాగరాజు

**గుడిపాల:** ప్రభుత్వ పాఠశాలలో పనిచేస్తున్న ఆయాలకు పెండింగ్‌లోని జీతాలను త్వరితగతిన చెల్లించాలని ఏఐటీయూసీ గౌరవాధ్యక్షుడు నాగరాజు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో ఆయాల వర్కింగ్ యూనియన్ సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది మొదలుకుని ఆయాలకు జీతాలు చెల్లించడం లేదన్నారు. తక్కువ జీతంతో పనిచేసే సిబ్బంది ఇబ్బంది పెట్టడం సమంజసం కాదన్నారు. జీతాలు ఇవ్వడంతోపాటు వారికి గుర్తింపు కార్డు, ఫినాయిల్, చీపురు కట్టలు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. సమావేశంలో నాయకులు రమేష్, రఘు, సుబ్రమణ్యం, రమాదేవి, ఆశ తదితరులు పాల్గొన్నారు.

## కమ్యుటేషన్ రికవరీ నిలుపుదల ఉత్తర్వులపై హర్షం


సమావేశంలో మాట్లాడుతున్న గురురాజారావు

**గంగవరం:** ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగుల కమ్యుటేషన్ రికవరీ నిలుపుదల చేయడం హర్షణీయమని విశ్రాంత ఉద్యోగుల అసోసియేషన్ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు గురురాజారావు అన్నారు. పలమనేరులో ఆదివారం ఏర్పాటు చేసిన రిటైర్డ్ ఉద్యోగుల అసోసియేషన సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర ఖజానా లెక్కల శాఖ సంచాలకులు జారీ చేసిన మెమోలో అక్టోబర్ నాటికి 11 ఏళ్ల 3నెలల కాల పరిమితి దాటిన ప్రతి పెన్షనర్‌కు కమ్యుటేషన్ రికవరీ నిలుపుదల చేయాలంటూ రాష్ట్రంలోని ఖజానా కార్యాలయాలకు ఉత్తర్వులు ఇచ్చారన్నారు. గతంలో నిర్ణయించిన 15 ఏళ్ల కాలంలో కమ్యుటేషన్ రికవరీలపై రిటైర్డ్ ఉద్యోగులు హైకోర్టును ఆశ్రయించి ఇంటీరియం ఉత్తర్వులను పొందారని, 1980వ ఏట బేసిక్ పెన్షన్‌లో 10.7 శాతం నుంచి 8కి మారే సమయంలో తీసుకుని 40 శాతం మొత్తాన్ని 15 ఏళ్లలో ప్రభుత్వానికి చెల్లించామన్నారు. అయితే 2010లో 9వ పే కమిషన్‌లో భారీగా జీతాలను పెంచడంతో బేసిక్ పెన్షన్‌లో 8.4 శాతానికి తగ్గించి ఆ మేరకు 40 శాతం మొత్తాన్ని రిటైర్డ్ ఉద్యోగులకు కమ్యుటేషన్ మొత్తాలను అందించిందన్నారు. అదే సమయంలో రిజర్వ్ బ్యాంకు వడ్డీ రేట్లను 12 శాతం నుంచి 7 శాతానికి తగ్గించారని, 1980లో మనిషి సగటు జీవిత కాలం 57 ఏళ్లు కాగా 2010లో 72 ఏళ్లకు పెరిగిందన్నారు. అలా సగటు వయసు పెరగడం వల్ల ప్రభుత్వానికి విశ్రాంత ఉద్యోగి చెల్లింపులో నష్టం జరిగే అవకాశం తగ్గిపోయిందన్నారు. ఈ విషయాలను రిటైర్డ్ ఉద్యోగులు గతంలో హైకోర్టుకు నివేదించడంతో ప్రభుత్వం స్పందించి రికవరీని 11 ఏళ్ల 3 నెలలకు కుదిస్తూ ఆదేశాలు జారీ చేసిందని పేర్కొన్నారు. కార్యక్రమంలో పెన్షనర్ల అసోసియేషన్ నాయకులు గౌస్, కృష్ణమూర్తి, నరసింహులు, ఆంజప్ప, చంద్రశేఖర్, గురుస్వామినాయుడు, రెడ్డెప్ప, వీరభద్రగౌడు, మాలతి తదితరులు పాల్గొన్నారు.

## కంది పంటకు చీడపీడల బెడద

- ఆందోళన చెందుతున్న అన్నదాతలు


దిగువ మోదలపల్లె వద్ద పూత, పిందె దశలో ఉన్న కంది పంట

**తవణంపల్లె:** వర్షాధారంపై ఆధారపడి వేరుశనగ పంటలో అంతర పంటగా సాగు చేసే కంది పంటలకు చీడపీడల బెడద అధికమైంది. మండలంలో ప్రస్తుతం కంది పంట పూత దశలో ఉంది. మండలంలో ఇటీవల కురిసిన వర్షాలకు కంది పంట ఏపుగా పెరిగి కళకళలాడుతోంది. కంది పచ్చదనం వల్ల పురుగులు, తెగుళ్లు అధికంగా ఆశించాయి. కంది పంటను కాయతొలుచు, ఆకు చుట్టు, మారుకా మచ్చల పురుగులు ఆశిస్తున్నాయి. అదే విధంగా కాయ ఈగలు, ఎండు తెగుళ్ల సోకుతున్నాయి. పురుగులు, తెగుళ్లబ నివారణకు సకాలంలో సస్యరక్షణ చర్యలు చేపడితే మంచి దిగుబడి సాధించవచ్చునని వ్యవసాయ అధికారి జి. ప్రవీణ్ చెప్పారు.

**పురుగుల నివారణకు చర్యలు**

– కాయ తొలుచు పురుగు నివారణకు తొలిదశలో గుర్తిస్తే 5 శాతం వేప గింజల కాషాయం పిచికారీ చేస్తే నివారించవచ్చు. పురుగుల ఉధృతి అధికంగా ఉంటే మొగ్గ దశలో క్లోరిఫైరిఫాస్ మందును లీటరు నీటిలో 2.5 మిల్లీ లీటర్లు పిచకారీ చేయాలి. పూత కాయ దశలో క్వినాల్‌ఫాస్ మందును స్ప్రే చేయించాలి.

- ఆకు చుట్టు పురుగుల నివారణకు మోనోక్రోటాఫాస్ 1.6 మిల్లీ లీటర్లు లేదా క్వినాల్‌ఫాస్ మందు 2 మిల్లీలీటర్లు లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలి.
- మారుకా మచ్చల పురుగుల నివారణకు ఎసిఫేట్ ఒక గ్రాము, థయోడికార్బ్ ఒక గ్రాము మందును లీటరు నీటిలో కలపి పిచికారీ చేస్తే నివారించవచ్చును.
- భూమిలో తేమ ఎక్కువ ఉండే భూములు కంది సాగు అనువైనది కాదు. దీని వల్ల ఎండు తెగుళ్ల వ్యాపిస్తాయి. రైతులు పురుగులను గుర్తించి సకాలంలో సస్యరక్షణ చర్యలు చేపడితే మంచి దిగుబడి వస్తుంది.

### ఉచిత కంటి వైద్య శిబిరానికి స్పందన


మాట్లాడుతున్న శంకర్ నేత్రాలయ వైద్యాధికారి

**బైరెడ్డిపల్లె:** చెన్నై శంకర నేత్రాలయ, మిషన్ ఫర్ విజన్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాల వద్ద నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరానికి మంచి స్పందన లభించింది. శిబిరంలో 60 మందికి వైద్య పరీక్షలు చేసి 29 మందిని కంటి ఆపరేషన్లకు ఎంపిక చేశారు. చెన్నైలో ఆపరేషన్లు చేస్తామని, వారికి ఉచిత ప్రయాణం, భోజన వసతి కల్పించడంతోపాటు మందులు అందజేయనున్నట్టు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో వైద్యాధికారులు మురళి, క్రిష్ణ, శ్రీనివాసులు, నిర్వాహకులు చంద్ర, చిన్నప్ప పాల్గొన్నారు.

Canara Bank
**ఖాతాదారులకు సూచన**


శ్రీ ఆర్.మునిరత్నం నాయుడు
డైలీ కలెక్షన్ ఏజెంట్,
(PIGMY)
సిండికేట్ బ్యాంక్

శ్రీ ఆర్.మునిరత్నం నాయుడు గారు సిండికేట్ బ్యాంక్(ప్రస్తుతం కెనరా బ్యాంకు) చిత్తూరు–2 శాఖ నందు 1977 నుండి డైలీ కలెక్షన్ ఏజంట్[PIGMY]గా పని చేసేవారు. వారు తేది. 08/04/2024 నుండి విధుల నుండి నిలిచిపోయినారు. శ్రీ ఆర్.మునిరత్నం నాయుడుగారు కలెక్షన్ ఏజంట్లుగా ఉన్న ఖాతాదారులకు సంబంధించిన డైలీ కలెక్షన్ లావాదేవీల విషయములో ఎటువంటి అభ్యంతరాలు ఉన్న నేటి నుండి 30 రోజులలో సిండికేట్ బ్యాంక్ (ప్రస్తుతము కెనరా బ్యాంక్) చీఫ్ మేనేజర్ గారిని సంప్రదించ వలె [illegible]

చీఫ్ మేనేజర్, సిండికేట్ బ్యాంక్ (ప్రస్తుతము కెనరా బ్యాంక్),
10–402, ఫస్ట్ ఫ్లోర్, ఎంబిఆర్ కాంప్లెక్స్,డి.ఐ.రోడ్,చిత్తూరు–2 శాఖ